క్లుప్తంగా

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎంటీఎస్) నాన్ టెక్నికల్ హవల్దార్– 12523 ఉద్యోగాలు, ఎల్‌ఐసీ ఏడీవో –9394 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందని, లాజిక్ అకాడమీ సంస్థ డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు స్థానిక అంజయ్యరోడ్డులోని తమ సంస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు 75 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7207012758 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హుండీలోని నగదు చోరీ


అభయాంజనేయస్వామి వారి దేవాలయం

ఒంగోలు టౌన్: నగరంలో మంగమూరు రోడ్డులోని మర్రిచెట్ల కాలనీ దగ్గర ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. గేటు తాళం పగులగొట్టి గుడిలోకి ప్రవేశించి హుండీలోని సుమారు 4 వేల రుపాయలను తీసుకెళ్లారు. దేవస్థానం కమిటీ ఫిర్యాదు మేరకు తాలుకా ఎస్‌ఐ కొత్తపల్లి అంకమ్మ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోవులకు ఆహారం అందజేత



గోవులకు ఆహారాన్ని అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఒంగోలు టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం ప్రకాశం ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ గోశాలలో ఆదివారం గోవులకు ఆహారాన్ని అందజేసినట్లు క్లబ్ ప్రెసిడెంట్ జక్కిరెడ్డి బ్రహ్మారెడ్డి తెలిపారు. ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలను ప్రారంభించే ముందు గోవులకు ఆహారాన్ని అందజేయడం ఆనవాయతీగా వస్తోందన్నారు. క్లబ్ మాజీ అధ్యక్షులు ఫిరోజ్, ప్రసన్న కుమార్, కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి, ఉపాధ్యక్షులు సల్మాన్ ఖాన్, సభ్యులు ఫోయబ్, ఇక్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ షాకీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తపట్నం: స్థానిక ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలుపదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ జి.వీరాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపట్నం, రంగాయపాలెం, అల్లూరు, గమళ్ళపాలెం గ్రామాల్లో సాగుచేస్తున్న రొయ్యల చెరువులు, వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే విద్యుత్ నిలుపుదల ఉంటుందన్నారు. టౌన్‌లో మాత్రం ఇళ్లకు నిరంతరాయంగా ఉంటుందని చెప్పారు.

శాప్ మోడల్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

అద్దంకి రూరల్: స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (శాప్) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారు. అద్దంకి మండల యూనిట్ ఆధ్వర్యంలో అద్దంకిలోని ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పరీక్షకు అద్దంకి మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 108 విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో మండలంలోని తిమ్మాపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఏ. శ్రీరామ్‌శాయి సూర్యతేజకు, రెండో స్థానం అద్దంకి ప్రకాశం ఉన్నత బాలిక కె. షణ్ముఖప్రియ సాధించారు. పరీక్షల నిర్వహణలో బాపట్ల జిల్లా మాజీ అధ్యక్షుడు కె. మాధవరావు, అద్దంకి మండల బాధ్యుడు కె. శ్రీనివాసరావు, ఈశ్వరయ్య, బీసీహెచ్ చంద్రశేఖర్, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ బజార్‌ను ప్రారంభించిన నగర మేయర్



క్రాఫ్ట్ బజార్ స్టాల్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: స్థానిక పాత మార్కెట్ సెంటర్‌లోని మున్సిపల్ మైదానంలో ఆదివారం రాత్రి నగర మేయర్ గంగాడ సుజాత క్రాఫ్ట్ బజార్‌ను ప్రారంభించారు. చేనేత, హస్తకళా ప్రదర్శన, అమ్మకాన్ని తిలకించారు. పలు రాష్ట్రాలకు చెందిన చేతివృత్తులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వస్త్రాలు క్రాఫ్ట్ బజార్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ సూచించారు. క్రాఫ్ట్ బజార్ నిర్వాహకులు వై.వెంకటేశ్వరరెడ్డి, అంకిరెడ్డి, వల్లంశెట్టి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ క్రాఫ్ట్ బజార్ మార్చి ఒకటో తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. 50 వేల రకాలు కలిగిన ఉత్పత్తులు నగర ప్రజలను తమ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. 23వ డివిజన్ కార్పొరేటర్ ఇంతియాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

- 400 మందికి వైద్య పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: శ్రీరాం మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా మల్టీస్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. 400 మంది రోగులను ఉచితంగా వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో గర్భిణుల సమస్యలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సమస్యలు, దగ్గు, నెమ్ము ఆయాసం, ఛాతీ, ఊపిరితిత్తులు, దంత సమస్యలు, బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులైన కొలెస్ట్రాల్, గుండె, కిడ్నీ, లివర్, నరాల సమస్యలు, మెదడు, పక్షవాతం, ఫిట్స్, కడుపు నొప్పి, గ్యాస్ ట్రబుల్, అల్సర్, అపెండిక్స్, వరబీజం, హెర్నియా, ఫిస్టులా, వేరికోజ్ మెయిన్స్, కిడ్నీలో రాళ్లు, లివర్ (పసర తిత్తి)లో రాళ్లు, ఫిజియో థెరపీ సమస్యలు మొదలగు వ్యాధులకు నిపుణులైన వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, బీపీ, షుగర్, యూరిక్ యాసిడ్, పాదాల నరాల పరీక్ష, పల్స్ ఆక్సీ మీటర్ పరీక్షలు ఉచితంగా చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో భారీ ఉచిత శిబిరం నిర్వహించడాన్ని అభినందించారు. తాను పుట్టి పెరిగిన ఊరిలోనే పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చాపల వంశీ కృష్ణ, దంపతులను అభినందించారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు ధైర్యాన్ని నింపారని గుర్తు చేశారు. రామాయపట్నం సీఐ దేవు కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్యాన్ని తన ఊరి ప్రజల వద్దకు తీసుకురావడమే కాకుండా అందరికి అందుబాటులో ఉంచుతున్నారని డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ శాంతకుమారి కొనియాడారు. డాక్టర్లు చాపల వంశీ కృష్ణ, చాపల శాంతకుమారి, సానల ధీరజ్‌బాబు, సున్నపు విజయ్ కుమార్, నాగిడి కుమార్ వర్మ, సున్నపు నవీన్, పాక్కినగారి ఏడుకొండలు వైద్య సేవలు అందించారు. ఎంపీటీసీలు చలంచర్ల తిరపతమ్మ, మిట్నసల శాంతారావు, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, డాక్టర్ జీవీ కృష్ణయ్య, గేనం సుబ్బారావు, దేవు చలపతి వర్మ, శ్రీవాణి విద్యానికేతన్ కరెస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, రాజశేఖరరెడ్డి, శ్రీనిధి వొకేషనల్ కాలేజీ చైర్మన్ వాయల విజయరత్నం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభావితం చేస్తున్న మన్‌కీ బాత్ ప్రసంగాలు


మాట్లాడుతున్న జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు

ఒంగోలు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. మన్‌కీ బాత్ ద్వారా చేస్తున్న ప్రసంగాలు ప్రతి ఒక్కరిని ప్రభావితం చేసే విధంగా ఉన్నాయని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రేడియోలో ప్రసారమైన మన్‌కీ బాత్ ప్రసంగాన్ని జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో కవులు, రచయితలతో కలిసి ఆలకించారు. ఈ సందర్భంగా పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో కూడా గురజాడ అప్పారావు రచించిన దేశమును ప్రేమించుమన్నా , అన్న దేశభక్తి గీతాన్ని మోదీ చదివి వినిపించి తెలుగు కవితకు, తెలుగు కవికి ఒక ప్రత్యేక మైన గుర్తింపును ఇచ్చారన్నారు. సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి తోడ్పడవోయ్, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే కవితలోని భావంలో దేశమంటే మట్టికాదని గుర్తించి ప్రతి ఒక్కరూ సహాయం చేసే గుణాన్ని అలవరుచుకోవాలనే సత్యాన్ని మోదీ తన మాటల ద్వారా ప్రపంచానికి చాటారన్నారు.

సంఘం ప్రధాన కార్యదర్శి , అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ మదర్ ఆఫ్ డెమోక్రసీపై మంచి వివరణ ఇచ్చారని, ఈ సంవత్సరం ప్రతిభావంతులను, సేవా తత్పరులను గుర్తించి పద్మశ్రీ ఇవ్వడంపై హర్షాన్ని వ్యక్తం చేశారు. సంఘ సహాయ కార్యదర్శి మూఢమంచు వెంకటేశ్వర్లు, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్‌జాన్, అడ్వకేట్ రవి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించేనా?


రాజా పానగల్ రోడ్డులో మతిస్థిమితం లేని వ్యక్తి


కలెక్టరేట్ సమీపంలో మహిళ..

ఒంగోలు టౌన్: ప్రతి చెట్టుకు..పుట్టకు పేరున్నట్టే ప్రతి మనిషికీ ఓ పేరుంటుంది. ఊరుంటుంది.. తలదాచుకునేందుకు కాసింత గూడుంటుంది. ఆకలేసినప్పుడు ఇంత అన్నం పెట్టి.. ఆవేదనలో ఉన్నప్పుడు గుండెలకు హత్తుకునే ఓదార్పు ఉంటుంది. అయితే వీరికి భిన్నంగా అనాథలుగా బతుకుతున్నవారెంతో మంది ఉన్నారు. ఇలాంటి మానసిక దివ్యాంగులు ఇటీవల ఒంగోలు నగరంలో ఎక్కువగా కనిపిస్తున్నారు. నగరంలోని పాత కూరగాయల మార్కెట్, డి మార్ట్ పరిసరాలు, లాయరు పేట చౌరస్తా, రాజా పానగల్ రోడ్డులో నగ్నంగా.. అర్ధ నగ్నంగా తిరుగుతున్న వీరిని చూసి చిన్నారులు భీతిల్లి పోతున్నారు. మాసిన బట్టలు, పెరిగిన జుట్టుతో కనిపించే వీళ్లు హోటళ్ల, టీ స్టాల్స్, వీధుల్లో భిక్షాటన చేస్తున్నారు. రాత్రి పూట ఏ గుడి మెట్ల మీదనో..ప్లాట్‌ఫాం మీదనో తలదాచుకుంటున్నారు. అంతిమ యాత్రలో భుజం పట్టేందుకు ఆ నలుగురు లేక దిక్కులేకుండా లోక యాత్ర ముగించుకుంటున్నారు. అలా మార్చ్యురీలో రోజుల తరబడి అనాథ శవాలుంటున్నాయి. గత మంగళవారం రాత్రి స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో ఓ అనాథ చలికి తట్టుకోలేక మృతి చెందడం స్థానికులను కంటతడి పెట్టించింది. ఈక్రమంలోనే నగరంలో ఇలా ఒంటరిగా తిరుగుతున్న వారి గురించి అంతా మాట్లాడుకుంటున్నారు. మానవత్వం కనుమరుగై పోతున్న నేటి డిజిటల్ రోజుల్లో.. ఎవరైనా వీరికి ఆసరాగా ఉండాలని కోరుకుంటున్నారు.

విచారణ ఎంతకాలం చేస్తారు.. ?

వేటపాలెం: వేటపాలెం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నిధుల గోల్ కేసు కేసులో పోలీసులు విచారణ ఎంతకాం చేస్తారని బాధితులు ప్రశ్నించారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సొసైటీ నిధుల గోల్‌మాల్ ఘటన జరిగి ఒకటిన్నర సంవత్సరం అయినప్పటికీ ఇంత వరకు పోలీసులు నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయలేదన్నారు. నిధులు గోల్‌మాల్ చేసిన వారిని ఎంత కాలం విచారిస్తారన్నారు. 600 మంది డిపాజిట్ల రూపంలో దాచుకున్న రూ. 25 కోట్లు నగదును సొసైటీ కార్యవర్గం సభ్యులు నమ్మకంగా గోల్‌మాల్ చేశారన్నారు. బాధితుల్లో ఇప్పటికే 14 మంది మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు సత్వరమే స్పందించి విచారణను వేగవంతం చేసి బాధితుల సొమ్ము వెంటనే తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బాధితులు జే రమేష్ బాబు, కారంచేటి శివరామకృష్ణ, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మారెడ్డి రమణారెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల తరువాత అ'పూర్వ' సమ్మేళనం


చివుకుల కోటేశ్వరశర్మకు నివాళి అర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు టౌన్: బాల్యంలో అంతా కలిసి చదువుకున్నారు. యవ్వనాన్ని దాటి వృద్ధాప్యంలోకి అడుగుపెట్టారు. యాభై ఏళ్ల తరువాత కలుసుకొని చిన్ననాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటూ పిల్లల్లా ఆడిపాడారు. ఈ అపూర్వ దృశ్యం ఒంగోలు పీవీఆర్ స్కూలులో కనిపించింది. 1968 నుంచి 1972 వరకు స్కూలులో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఐదు దశాబ్దాల క్రితం కలిసి చదువుకొని ఉద్యోగ వ్యాపారాల్లో, వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్న 200 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల మరణించిన చివుకుల కోటేశ్వర శర్మ చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళి అర్పించారు. తమకు చదువులు చెప్పి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఉపాధ్యాయులు కొప్పోలు హనుమంతరావు, కె.కోటేశ్వరరావులను సత్కరించారు. ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖులు బేతంశెట్టి హరిబాబు, కర్ణ నాగేశ్వరరావు, బత్తిన ప్రకాష్, ఐ.కె రావు, గాదె శ్రీనివాసరావు, మాంటిస్సోరి ప్రకాష్ పాల్గొన్నారు.

43 ఏళ్ల తరువాత..

కొత్తపట్నం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980–81 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. కోడూరి శివకుమార్ అధ్యక్షతన ఉదయం పాఠశాలకు చేరుకుని యోగ క్షేమ సమాచారాలు పంచుకున్నారు. హైస్కూల్ ఆవరణలో ఉన్న సరస్వతి విగ్రహానికి పూలమాలలు అర్పించారు. తమ బ్యాచ్‌లో అనారోగ్యంగా మృతి చెందిన విద్యార్థులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహితులకు ఆపద వస్తే ఆదుకోవాలని చెప్పారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను స్మరించుకుని మౌనం పాటించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం పాలేటి సుబ్బారావును, గాంధీ పబ్లిక్ స్కూల్ అధినేత ఆళ్ళ శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. కోడూరి ధనలక్ష్మి, షేక్ షీలార్ పాల్గొన్నారు.


కొత్తపట్నంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రోడ్డు నిర్మాణానికి ట్రాన్స్‌ఫార్మర్‌తో సమస్య


అమ్మనబ్రోలులో రోడ్డుకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నాగులుప్పలపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రోడ్ల నిర్మాణాలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీనివల్ల రోడ్లు నిర్మాణం ఆగిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమ్మనబ్రోలు నుంచి పమిడిపాడు వరకు ఉప్పుగుండూరు మీదగా 19 కి.మీ మేర నిర్మాణం తలపెట్టిన రోడ్డులో ఇప్పటికే కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. అయితే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టడానికి అమ్మనబ్రోలు నుంచి చవటపాలెం వెళ్ళే దారి మొదట్లోనే రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దానిని తొలగిస్తే రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు ఉండవని విశాలమైన రోడ్డు నిర్మాణం సాధ్యమవుతుందని సదురు కాంట్రాక్టర్ తెలిపాడు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డు తీసే విషయం ఏడాది కిందట విద్యుత్ శాఖ అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశామని కాంట్రాక్టర్ తెలుపుతున్నాడు. ఇదే విషయమై ఏఈ రమేష్‌ను వివరణ కోరగా రోడ్డు విస్తరణ క్రమంలో గతంలో అక్కడ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్.. ప్రస్తుత విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న మాట వాస్తవమేనని అయితే దానిని తొలగించడానికి సంబంధిత శాఖ నుంచి వచ్చిన దరఖాస్తుకు తిరుగు సమాధానం కూడా అందించామని చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రపంచ ప్రసిద్ధి చెందిన త్యాగరాజ కీర్తనలు


త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: స్వరరాగ సుధ సంగీత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక చెన్నకేశవ స్వామి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా జరిగింది. వీనుల విందుగా తాగరాజ కీర్తనలు ఆలపించారు. కె.బాబు కుందుర్తి వయోలిన్ ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విద్వాన్ గుంటూరు శ్రీనివాసులు మూర్తిని సన్మానించారు. ప్రపంచం నలుమూలలు త్యాగరాజకీర్తనలు ప్రసిద్ధి చెందాయని ముఖ్య అతిథిగా పాల్గొన్నా పోపూరి గౌరీనాథ్ అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా లక్ష్మీ కృష్ణప్రియ, సుబ్బలక్ష్మి, శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులు ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, చిట్యాల భవాని చౌదరి, డా.రామచంద్ర దమేష్, డా.కె.వి.ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు


కరాటేలో తలపడుతున్న చిన్నారులు

ఒంగోలు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17, 19 కరాటే పోటీల ఎంపిక స్థానిక మినీ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీసీ కాంట్రాక్టర్, సిద్ధార్థ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్టు గౌరవాధ్యక్షుడు మండువ సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. శారీరక శక్తికి, ఆత్మస్థైర్యం పెంపొందడానికి కరాటే ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యం కోసం తపిస్తున్నాడని, అందుకు క్రీడలు ఎలా ఉపయోగపడతాయనేది తెలియజేయాల్సిన అవసరం శిక్షకులపై ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా వందలామంది క్రీడాకారులు పాల్గొనడం బాగుందని కొనియాడారు. స్పోర్ట్స్ కరాటే ది అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు కేఎల్ఎం శాస్త్రి, కార్యదర్శి కొండ్రు కీర్తన్‌లు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కరాటే సామర్థ్యాలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, కాలేజీల స్థాయిలో ప్రాతినిధ్యం ఉంటున్నా యూనివర్శిటీల స్థాయిలో తక్కువగా ఉంటుందన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాస్థాయి కరాటే జట్ల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎంపిక కార్యక్రమం రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ కరాటే అసోసియేషన్ కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు, ఒంగోలు పట్టణ అభివృద్ధి సమితి అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


డ్రమ్ములను పారబోస్తున్న పోలీసులు

చీరాల: బెల్లం ఊట తయారీ స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. చీరాల మండలం బోయినవారిపాలెం శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈపూరుపాలెం పోలీసులు నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీ కోసం భూమిలో డ్రమ్ముల్లోదాచి ఉంచిన నాలుగు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ స్థావరాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని, నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జనార్దన్ తెలిపారు. దాడుల్లో ఈపూరుపాలెం పోలీసులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం కృత్తిక నక్షత్రం నవమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.